క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి

కైలాస్‌నగర్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ఖానాపూర్ నియోజకవర్గంలో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, పరిస్థితులపై చర్చించారు. ఆయన వెంట ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ ఉన్నారు.

ఐసెట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ

తలమడుగు: ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని కోడఛ్ గ్రామానికి చెందిన సాకే ప్రణీత్ 304 ర్యాంక్ సాధించాడు. గ్రామస్తులు, తల్లిదండ్రులు సన్మానించారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: నీట్ పరీక్షలో జాతీయస్థాయిలో 578 ర్యాంక్ సాధించిన ఆదిలాబాద్ పట్టణం ద్వారకానగర్‌కు చెందిన ఎనుగుర్తి రుత్విక్‌ను పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్, విద్యార్థి తల్లిదండ్రులు కవిత, రమణచారి, నాయకులు రవీందర్, లక్ష్మణ్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

డాక్టర్ వృత్తి గొప్పది

ఇంద్రవెల్లి: డాక్టర్ వృత్తి ప్రపంచంలోనే అతి గొప్పదని భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు పరత్‌వాగ్ దత్త అన్నారు. ప్రపంచ డాక్టర్స్ డేను పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి శ్రీకాంత్‌తో పాటు సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జాధవ్ శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు పెందోర్ అంకుష్, నాయకులు సూర్యవంశీ ఉత్తం, సోన్‌కాంబ్లే బాబాసాహెబ్ ఉన్నారు.

సికిల్‌సెల్ నిర్మూలనకు చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో సికిల్ సెల్ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. శనివారం మావల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సికిల్‌సెల్ నివారణకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత సికిల్‌సెల్ ఎనిమియా వస్తుందన్నారు. చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సర్పంచ్ దొగ్గలి ప్రమీల, ఎంసీహెచ్ పీవో విజయ సారథి, అనిల్, హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు

బోథ్: మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులకు వైద్య సిబ్బంది శనివారం సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు నవీన్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసింహస్వామి, ఏఎన్ఎం స్నేహ, శారద, పుష్పలత పాల్గొన్నారు.

టీసీప సభ్యుడిని సన్మానించిన ఎంపీ

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఇటీవల నియామకమైన ఆదిలాబాద్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు దినేష్ మటోలియాను శనివారం ఎంపీ సోయం బాపురావు సన్మానించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ జీవీ. రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, రాళ్ల బండి మహేందర్, లాలమున్న, వేదవ్యాస్, భీం సేన్‌రెడ్డి, హనుమాండ్లు, కరణ్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. శనివారం మండల ఆదివాసీ సంఘాలు, సర్‌మెడిలతో కలిసి మాట్లాడారు. పోడు భూములకు సీఎం కేసీఆర్ పట్టాలు అందచేశారన్నారు. కార్యక్రమంలో మత్తడిగూడ సార్‌మెడి నైతం చిత్రు పటేల్, ఉప సార్‌మెడి పంద్ర మాణిక్‌రావు, భూమాజి పటేల్, లచ్చు, లచ్చు పటేల్, జుగాదిరావు, రామారావు, యాదవ్‌రావు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

నేరడిగొండ: రవాణాపరంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పనులు వేగవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే దారిలో రూ.3.28 కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున వంతెన పనులు మరింత వేగవంతంగా చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డులు అందజేయాలి

బోథ్: భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌కార్డులు అందజేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. లేబర్ కార్డుల కోసం ఇచ్చోడలోని కార్మికశాఖ కార్యాలయానికి వెళ్తే ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. సంఘం అధ్యక్షుడు సాయిని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చామకూర మల్లేష్, శ్రీనివాస్, రాజేశ్వర్, రమేశ్, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

నిత్యం నరక ప్రయాణం

- నత్తనడకన సాగుతున్న రోడ్ల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఈఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి మర్లపెల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ రాము. గత మూడు సంవత్సరాలుగా రోడ్డు పనులు కొనసాగుతుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నాడు. పనులు త్వరగా పూర్తి చేయాలని రహదారి నిర్మించే సిబ్బందికి దండం పెట్టి వేడుకున్నాడు.



మర్లపెల్లి రోడ్డు దుస్థితి

ఇచ్చోడ: జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. నూతన రోడ్లు నిర్మించక, మరమ్మతులు చేయక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అలాగే బోథ్ నియోజకవర్గంలో ప్రధాన రోడ్డు పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మూడేళ్ల నుంచి పనులు కొనసాగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లను వేగవంతంగా నిర్మించాలని అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

- బోథ్ మండల కేంద్రం నుంచి కంటెగామ్ వరకు 16 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి 2018–19లో రూ. 19 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ 2022 మార్చి నాటికి పనులు పూర్తి చేయాలి. 2023 జూలై 1 వరకు 40 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.
- ఇచ్చోడ మండల కేంద్రం నుంచి సొనాల వరకు 2021లో రూ. 14 కోట్లతో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. 2022 మార్చి నాటికి పూర్తి చేయాలి. 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్, పిప్రి, అడేగామ(కె) గ్రామాల్లో దాదాపు రెండు కిలోమీటర్ల సీసీరోడ్డు పనులను అర్ధాంతరంగా వదిలేశారు.
- బజార్‌హత్నూర్ మండల కేంద్రం నుంచి మొర్కండి మీదుగా బరంపూర్ వరకు 15 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణం కోసం 2018లో రూ. 17 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మొర్కండి, బరంపూర్ మధ్య అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల రోడ్డు పనులు పూర్తి కాలేదు.
- బోథ్ మండలంలోని కుచ్లపూర్ నుంచి ధన్నూర్ మీదుగా సారంగపూర్ మండలంలోని అడెల్లి వరకు 2021లో రూ. 9 కోట్లు మంజూరయ్యాయి. కానీ బోథ్ మండల పరిధిలో అటవీప్రాంతంలో ఘాట్ కటింగ్ పూర్తికాక పనులు నిలిచిపోయాయి.
- ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు రెండు కిలోమీటర్ల నిర్మాణం కోసం 2018లో రూ. 7కోట్లు నిధులు మంజూరయ్యాయి. 2023 కూడా పనులు ప్రారంభించపోవడంతో అధికారులు పాత టెండర్‌ను రద్దు చేశారు. వారం రోజుల కిందట రూ. 13 కోట్లు నిధులు మంజూరు చేశారు. మళ్లీ టెండర్ ప్రకియ కావాల్సి ఉంది.

బిల్లుల ఆలస్యంతో జాప్యం

బిల్లుల ఆలస్యంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. దీంతో సకాలంలో పనులు పూర్తికావడం లేదు. నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం

– సునీల్, ఆర్అండ్‌బీ, డీఈ

ప్రశాంతంగా గ్రూప్–4 పరీక్ష



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీస్

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రూప్– 4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో ఆరు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు హాజరయ్యారు. ఆరు కేంద్రాల్లో 2178 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 266 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు తహసీల్దార్ మోహన్‌సింగ్, ఎండీవో రాంప్రసాద్‌లు తెలిపారు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీకాంత్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోథ్: బోథ్ మండలంలో గ్రూప్– 4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఐదు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,160 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒక అమ్మాయి సమయానికి రాకపోవడంతో అధికారులు లోనికి అనుమతించలేదు. సీఐ కిరణ్‌కుమార్ ఎస్సై రవీందర్‌లు పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో నిర్వహించిన గ్రూప్– 4 పరీక్ష శనివారం ప్రశాతంగా సాగింది. మొత్తంలో 13 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఆదిలాబాద్, సిర్పూర్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు పరీక్షకు ఆలస్యంగా రావడంతో వెనుదిరిగారు. డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పరీక్ష సెంటర్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఆదిలాబాద్‌రూరల్: కళాశాలల్లో ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శివరామప్రసాద్ అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని బోథ్ గిరిజన సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ చట్టాలను విద్యార్థులకు వివరించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ కేసుల్లో జరిమానాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేవ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసస్వామి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శివరామప్రసాద్

వసతుల కల్పనలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

ఆదిలాబాద్: మున్సిపాలిటీ పరిధిలో కనీస వసతుల కల్పనలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో శనివారం పాల్గొని మాట్లాడారు. వందల కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతి, మయూర్ చంద్ర, వేణుగోపాల్, సాయి, మున్నా, చిలుకూరి జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, రాజేష్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాయల్ శంకర్

డీసీసీబీలను విలీనం చేయాలి

ఎదులాపురం: డీసీసీబీలను ఇతర బ్యాంకుల్లో విలీనం చేయాలని తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సహకార బ్యాంకు ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న మూడంచెల విధానానికి బదులుగా రెండంచెల విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 15వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీసీసీబీ ఈఏ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, ఇమ్రాన్, చంద్రశేఖర్, శ్రీవాణి, శ్వేత, మల్లిక పాల్గొన్నారు.



ఆందోళన చేస్తునన డీసీసీబీ బ్యాంకు ఉద్యోగులు

'రైతులు పంట రుణాలు చెల్లించవద్దు'

నేరడిగొండ: రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలు చెల్లించవద్దని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటివరకు రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎదులాపురం: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడుతూనే దేశభక్తి, జాతీయవాదం, నైతిక విలువల పెంపు కోసం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ అన్నారు. అర్బన్ మండల శాఖ అధ్యక్షుడు దత్తాత్రి ముండే ఆధ్వర్యంలో పట్టణంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సునీల్‌చవాన్, జిల్లా ఉపాధ్యక్షుడు మెట్పల్లి గోపాలకృష్ణ, గాండ్ల అనిల్, గోపాల్ కాంబ్లే, కేశవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి, లక్ష్మారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మొట్టే కిరణ్ కుమార్, ఎంపీపీ రాథోడ్ సజన్, శివారెడ్డి ఉన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యువనేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. దీంతో ఫౌండేషన్ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నిఖిల్, రాహుల్, వినోద్, సృజన్, యోగేశ్, చిన్న, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో శనివారం గ్రామస్తులు వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. గత కొన్ని రోజులుగా వర్షాల జాడ లేకపోవడంతో మహిళలు డప్పుచప్పులతో ఊరేగింపుగా వెళ్లి.. గ్రామంలోని రామాలయం, పోచ్చమ్మ, మైసమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం దేవత విగ్రహాలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాత్విక, ఎంపీటీసీ రెడ్డి దేవమ్మ, నరేందర్, రమేశ్, నరేశ్‌రెడ్డి, శ్రీనివాస్, దేవారెడ్డి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి

తాంసి: పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టాలని సెక్టోరియల్ అధికారి నర్సయ్య ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలని, క్రమశిక్షణతో చదివితే లక్ష్యం సులువుగా చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉమా మహేశ్వర్, పవన్ ఉన్నారు.



మాట్లాడుతున్న అధికారి నర్సయ్య

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

జైనథ్: కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బాలాపూర్, ఆకుర్ల, నిరాల, సిర్సన్న, గూడ, లేకర్‌వాడ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ అమలు చేసే పథకాలు, వరంగల్ రైతు డిక్లరేషన్ గురించి వివరించారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ, రూ. 15వేల రైతుబంధు ఇస్తామన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉన్నా.. రూ. 5వేలకు తగ్గకుండా పెన్షన్ అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, సంతోశ్, శంకర్, సంతోశ్‌రెడ్డి, ముభీమ్, ప్రభాకర్ రావ్, దీపక్ రావ్, రవి కిరణ్‌రెడ్డి, అల్లూరి అశోక్‌రెడ్డి, కిష్టారెడ్డి, పాల్గొన్నారు.

బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్– మిలాప్

ఎదులాపురం: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఈద్–మిలాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముస్లిం మైనారిటీలందరూ చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. జోగు రామన్న నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా.. ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్కచాన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, షకీల్, వసీం, అజ్బత్, ప్రభాకర్, గిమ్మ సంతోశ్, నాగర్కర్ శంకర్, కొండూరి రవి, అల్లూరి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ఇంటింటికీ బీజేపీ ప్రచారం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి), ముఖరా(కె), మాన్కుగూడ, సాథ్‌నంబర్, దేవుల్‌నాయక్ తండా, కోకస్‌మాన్నూర్, దర్మంపూరి, నర్సాపూర్, చించోలి, గేర్జం గ్రామాల్లో శనివారం ఇంటింటా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టే, జిల్లా కార్యదర్శి కొల్లురి చంద్రశేఖర్, ఓబీసీ మండల అధ్యక్షుడు జాదవ్ రాము, మచ్చ అజయ్ పాల్గొన్నారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ..

బోథ్: గ్రామాల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని అల్పకాలిక విస్తారక్ వంగవీటి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని నిగిని, కంటెగాం, బాబేర తండా, మరలపెల్లి గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుభాష్, ప్రధాన కార్యదర్శి తుకారం పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కైలాస్‌నగర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అబ్దుల్లాచౌక్‌లో గల ప్రధాన డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను శనివారం పారిశుధ్య సిబ్బంది జేసీబీతో తొలగించారు. పనులను ఆయన పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, వార్డు కౌన్సిలర్ మోబిన్ ఉన్నారు.

నార్నూర్: సీజనల్ వ్యాధులపై గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం గాదిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలకు బీపీ ఆపరేటర్ పంపిణీ చేశారు. ఎక్కడైతే పారిశుధ్య లోపం ఉందో సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి వాటిని శుభ్రం చేయించేలా చూడాలన్నారు. మురికి నీటి వలన దోమలు తయారై మలేరియా, డెంగ్యూ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రెయినేజీ పూడిత తీస్తున్న మున్సిపల్ చైర్మన్

రైతు శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయం

ఇంద్రవెల్లి: రైతు శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయమని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. ప్రపంచ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యలయ అవరణలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా రైతు పండించిన పంటలను కొనుగోలు చేస్తూ ఎరువులను విక్రమిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో ధరంసింగ్, సిబ్బంది సునిత్, సురేష్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మారుతి డోంగ్రె

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇచ్చోడ: ఇంద్రవెల్లి మండలంలో ఇటీవల గిరిజన మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దుబార్‌పేట్ గ్రామపటేల్, సర్పంచ్ చాకటి అభిమాన్, యువజన సంఘం అధ్యక్షుడు నైతం నాగరాజ్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ మోహన్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు సాయికుమార్, పవన్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఇంద్రవెల్లి మండలంలోని ధనోరా గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. శనివారం మావల మండలంలోని బట్టిసావర్గాం శివారు ప్రాంతంలోని కుమురం భీం కాలనీలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని, ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

బోథ్: ఇంద్రవెల్లి మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బోథ్ ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సోనాలలో కొవ్వొత్తులు వెలిగించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబాలని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు